

పుస్తకావిష్కరణ సభలో కవులు, కళాకారులు

## సాహిత్యం ప్రజలను ఆలోచింపజేయాలి

**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోపాల్**

జనగామ చౌరస్తా, జూన్ 23 : సాహిత్యం ప్రజలను ఆలోచింపజేసేలా ఉండాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత తగుళ్ల గోపాల్, ప్రముఖ కవయిత్రి దాసోజు లలిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో కవి లగిశెట్టి ప్రభాకర్ రచించిన 'రేపటి వెలుగు', 'నవ్య నానీలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథులుగా కవి గోపాల్, కవయిత్రి లలిత హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల యోధుల జీవిత చరిత్రను స్మరించుకోవాలని సూచించారు. కవులు, రచయితలు తమ సామాజిక నేపథ్యాన్ని సాహిత్యంతో పునర్నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. అనంతరం విరసం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సాహిత్యం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కవులు, రచయితలు సామాజిక, సాంస్కృతిక పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమానికి ప్రముఖ కవి, కళాకారుడు జీ కృష్ణ సభాధ్యక్షత వహించగా, జరసం అధ్యక్షుడు అయిలా సోమనర్సింహాచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, డాక్టర్ లింగంపల్లి రామచంద్రం, పానుగంటి రామ్మూర్తి, పోచం సుజాత, నజీర్, కొలిపాక బాలయ్య, భాస్కర్, శ్రీలత, సాయి కిరణ్, డాక్టర్ సదానందం, ఎంపీటీసీ నర్సయ్య పాల్గొన్నారు.


## మానవత్వంతో స్పందించిన ఎన్ఆర్ఐ

**బాలుడి వైద్య చికిత్సకు రూ.లక్ష సాయం అందజేత**



రూ.లక్ష చెక్కును అందిస్తున్న జడ్పీటీసీ బేబీశ్రీనివాస్

జఫర్‌గఢ్, జూన్ 23 : మండలంలోని తిమ్మంపేటకు చెందిన రెండేళ్ల బాలుడు అరుదైన వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వైద్య చికిత్స కోసం ఎన్ఆర్ఐ రూ.లక్ష ఆర్థిక సాయం అందించారని జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన కుంబోజు, అలేఖ్య దంపతుల కుమారుడు మాధవన్ కొంత కాలంగా అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అమెరికాలో స్థిరపడిన ఇదే గ్రామానికి చెందిన చాడా వినయ్‌కుమార్ రెడ్డి స్నేహితుల ద్వారా బాలుడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే స్పందించి మిన్నెసోటా ఏరియా తెలంగాణ అసోసియేషన్ సహకారంతో, మాటా మార్కెటింగ్ అండ్ వలంటీర్ ఆధ్వర్యంలో మాటా ప్రెసిడెంట్ అనూష కాడర్ల సమక్షంలో బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష అందించారు. ఏ దేశమేగినా ఉన్న ఊరును మరిచిపోకుండా బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం మాటా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించినందుకు జడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. బాలుడిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో చాడా రాంరెడ్డి, రఘోత్తంరెడ్డి, చాడా వీణ, మాజీ సర్పంచ్ మల్లేశ్, తాళ్లపల్లి సత్యనారాయణ, ఎం వెంకటేశ్వర్లు, టీ సదానందం, నీలకంఠం పాల్గొన్నారు.



రాజమహేంద్రనాయక్‌ను సత్కరిస్తున్న లంబాడా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

## డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు శుభాకాంక్షలు

జనగామ చౌరస్తా, జూన్ 23 : జనగామ వెస్ట్‌జోన్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజమహేంద్రనాయక్‌ను ఆదివారం లంబాడా సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లాలోని లంబాడా, గిరిజనుల అభ్యున్నతికి సలహాలు, సూచనలు అందించాలని డీసీపీని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాంకుడోత్ అనిత బికోజి, ఎంపీటీసీ భిక్షపతి నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు అజ్మీరా స్వామినాయక్, మిట్యా, కాలురాం, రవి, శంకర్, మూర్తి, జితేందర్, కీమా, లక్ష్మణ్, వీర్య, హరిలాల్, బిక్కు, లాల్మ, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- ఆకాశాన్నంటుతున్న ధరలు
- సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆందోళన
- మరో నెల రోజులవరకు ఇలాగే ఉంటుందంటున్న వ్యాపారులు

# భగ్గుమంటున్న కూరగాయలు..



జనగామ, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : కూరగాయల ధరలు కొండెక్కాయి.. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదనే చందంగా మారింది. ఏ రకం కూరగాయలు కొనుగోలు చేయలన్నా సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో రూ.100కు సంచినిండా ఐదు రకాల కూరగాయలు తెచ్చుకునే వినియోగదారులు ఇప్పుడు ఒకటి, రెండు రకాలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ బోయినపల్లి మార్కెట్‌కు నిత్యం కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి జనగామకు హోల్‌సేల్ వ్యాపారులు మినీ వాహనాల్లో తెచ్చి లాభం చూసుకొని చిరువ్యాపారులకు, వీధుల్లో అమ్ముకునే వారికి 10 కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. ఆంధ్ర నుంచి హోల్‌సేల్ వ్యాపారికి అక్కడి నుంచి చిరువ్యాపారులకు వచ్చే సరికే ధరలు రెండు, మూడింతలు పెరుగుతుండగా, ఇక వినియోగదారుడికి చేరే సరికి ధర నాలుగింతలు అవుతున్నది. ధరల పెరుగుదలకు అటు హోల్‌సేల్, ఇటు రిటైల్ వ్యాపారులు చెబుతున్న కారణం ఒక్కటే ఆంధ్రప్రదేశ్‌లో అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా కూరగాయల పంటలు దెబ్బ తినడం వల్ల ఉత్పత్తి తగ్గిపోయి ధరలు పెంచుతున్నామని చెబుతున్నారు. రూ.20 కిలో ఉన్న టమాట నేడు ఏకంగా రూ.60కి, వంటమిర్చి రూ.20 నుంచి రూ.60కి, కొత్తిమీర రూ.50 నుంచి ఏకంగా రూ.220కి ఎగబాకాయి. ఇలా కూరగాయలు, ఆకుకూరల ధరలు ఐదురెట్లు పెరిగాయి. క్యాలీఫ్లవర్ కేజీ రూ.120, నిమ్మకాయ కేజీ రూ.200, బెండకాయ కేజీ రూ.100, బీరకాయ కేజీ రూ.140, క్యారెట్ కేజీ రూ.100, అలుగడ్డ కేజీ రూ.60, ఉల్లిగడ్డ కేజీ రూ.60, బీన్స్ కేజీ రూ.260, సొరకాయ కేజీ రూ.75, క్యాప్సికమ్ కేజీ రూ. 140, క్యాబేజీ కేజీ రూ.90, బీట్‌రూట్ కేజీ రూ.250, వెల్లుల్లి కేజీ రూ. 500 అల్లం కేజీ రూ.250 చేరింది.

**పెరిగిన పప్పుల ధరలు..**

కూరగాయలతో పాటు పప్పుల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. ప్రధానంగా ఆకుకూరల ధరలు భారీగా పెరిగాయి. పాల కూర కేజీ రూ.120 చేరగా, కొత్తిమీర కేజీ రూ.260, పచ్చిమిర్చి కేజీ రూ.180కి చేరడంతో మార్కెట్‌కు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. కేవలం 15 రోజుల్లోనే కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో కిలో కొనే వారు పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. టమాటా ధరలు కూడా పెరిగాయి. కూరగాయల ఉత్పత్తి తగ్గడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో వానలు బీభత్సం సృష్టించడంతో చాలా చోట్ల కూరగాయ పంటలు నష్టపోయాయి. మహారాష్ట్ర నుంచి వచ్చే టమాటా రాకపోవడంతో కేజీ టమాట జనగామ మార్కెట్‌లో రూ.60 పైనే పలుకుతోంది. క్యారెట్, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ ధరలు కూడా భారీగానే ఉన్నాయి.

కిలో బీట్ రూట్ రూ.80 కి పైగా ఉంది. ఉల్లి ధరలు కూడా భారీగా పెరిగాయి. పెరిగిన ధరలతో ప్రజలు పచ్చడి, కోడిగుడ్లు వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే నెల రోజుల పాటు కూరగాయల ధరలు ఇలాగే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయలతో పాటు పప్పుల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కంది పప్పు, పెసర పప్పు సహా సన్న బియ్యం ధరలు కూడా ఇప్పటికే పెరిగి సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతున్నది.

## వరుణుడు కరుణించాలని పూజలు

పాలకుర్తి, జూన్ 23: వానకాలం ప్రారంభమైనా ఆశించిన రీతిలో వర్షాలు లేకపోవడంతో వరుణుడు కరుణించాలని కోరుతూ మండలంలోని దుబ్బతండాలో గిరిజన మహిళలు ఆదివారం పూజలు చేశారు. వేపాకులు, నీళ్ల బిందెలతో బొడ్రాయి వరకు ప్రదర్శనగా వెళ్లి జలాభిషేకం చేశారు. ఈ సంవత్సరం భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి పంటలు సమృద్ధిగా పండాలని వరుణ దేవుడికి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో లకావత్ చిన్ని, సాలమ్మ, బుచ్చమ్మ, లక్ష్మి, పుల్లమ్మ, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



దుబ్బతండాలో బొడ్రాయికి జలాభిషేకం చేసేందుకు నీళ్ల బిందెలతో వెళ్తున్న మహిళలు

## రైల్వే అండర్ పాస్ సమస్యను పరిష్కరించాలి

**అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు**



కుంగిన రహదారిని పరిశీలిస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు

జనగామ చౌరస్తా, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీ రైల్వే అండర్‌పాస్‌తోపాటు హనుమకొండ రోడ్డు నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో పాత జలజ వాటర్ ప్లాంట్ పెద్ద మోరీ వద్ద కుంగిన రహదారికి మరమ్మతులు చేయాలని అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వే అండర్ పాస్, బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో కుంగిన రహదారిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి మాట్లాడుతూ చాలా రోజుల నుంచి వీవర్స్ కాలనీ అండర్ పాస్, బస్టాండ్‌కు వెళ్లే మార్గంలోని కుంగిపోయిన రహదారితో ఈ దారిలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అండర్ పాస్ వద్ద నిలిచిన మురుగు నీటిని తొలగించాలన్నారు. కుంగిన రహదారిని ఇటీవల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ పరిశీలించినా సమస్యను పరిష్కరించలేదన్నారు. వెంటనే కుంగిన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కుంగిన రహదారి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ'లో కథనాలు సైతం ప్రచురితమయ్యాయని తెలిపారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కొయ్యడ రవి, పండుగ నరేశ్, సల్ల మహేశ్, బింగి నర్సింహులు పాల్గొన్నారు.

## 10వేల హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలి

**టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్**

జనగామ చౌరస్తా, జూన్ 23 : రాష్ట్రంలో 10 వేల ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి, సెకండరీ గ్రేడ్ టీచర్లకు న్యాయం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా రంగంలో ప్రాథమిక పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో విద్య సరిగ్గా అందితేనే ఆ విద్యార్థి భవిష్యత్తులో రాణిస్తాడని పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు, తరగతి గదికి ఉపాధ్యాయుడు చొప్పున స్టాఫ్ ప్యాటర్న్ ఉండాలన్నారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టుల అర్హతల విషయంలో ఎన్‌సీటీఈ విధించిన నిబంధనలు సవరించి డీఈడీ, బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు కామన్ సీనియార్టీ పద్ధతిలో ప్రమోషన్లు కల్పించాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

### పాలిసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

జనగామ చౌరస్తా, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పాలిసెట్–2024 సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు తొలిరోజు 150మంది విద్యార్థులు హాజరయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ నర్సయ్య తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియను డాక్టర్ టీ వెంకట్ రెడ్డి, డాక్టర్ ఏ రవీందర్‌నాయక్, డాక్టర్ వై గణేశ్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు వై గణేశ్, కళావతి, కరుణాకర్, సీహెచ్ మోహన్, జీ కల్పన, ఎస్ ప్రసన్నలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

## చోరీల నివారణకు పోలీసుల తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను పరిశీలిస్తున్న ఏఎస్సై

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 23 : చోరీల నివారణ చర్యల్లో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కానిస్టేబుళ్లు దేవరాజ్, అనిల్‌తో కలిసి ఏఎస్సై రాజమౌళి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన గల బస్టాండ్‌లో, శివునిపల్లిలోని రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు ఉన్నారా..? అని తెలుసుకున్నారు. అనంతరం ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. పాత నేరస్తులు ఉన్నారా..? ఉంటే ఎక్కడ ఉంటున్నారు..? ప్రస్తుతం వారు ఏం చేస్తున్నారు..? అనే విషయాలపై ఆరాతీశామని ఏఎస్సై రాజమౌళి తెలిపారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## కేజీబీవీలో విద్యార్థిని ఆత్మహత్య



వర్షిణి (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 23 : చిల్పూరు మండలం కేజీబీవీ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వర్షిణి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిమానితండాకు చెందిన ఇస్లావత్ పీరమ్మ, కిషన్ దంపతుల కూతురు వర్షిణి(14). ఈ నెల 21న వర్షిణికి ఇష్టం లేకపోయినా చిల్పూరు కేజీబీవీలో 9వ తరగతిలో చేర్పించారు. అదే రోజు రాత్రి వర్షిణి భోజనానికి కూడా వెళ్లలేదు. మరుసటి రోజు ఉదయం విద్యార్థులు కాలకృత్యాలకు వెళ్లారు. వర్షిణి మాత్రం చెద్దరు కప్పుకుని పడుకుని ఉంది. గదులను శుభ్రం చేయడానికి వచ్చిన అటెండర్ వర్షిణిని లేపే ప్రయత్నం చేయగా నోటి నుంచి నురుగు రావడం, వాంతులు చేసుకుని ఉండడం, కూల్ డ్రింక్ బాటిల్ పక్కనే ఉండడం గమనించి కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సోనికి తెలిపారు. వెంటనే వర్షిణిని చికిత్స నిమిత్తం స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి పీరమ్మ తన కూతురు మృతికి ఎవరూ కారణం కాదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

## లింగంపల్లిలో వెలిగిన వీధి దీపాలు

**'నమస్తే తెలంగాణ' కథనంపై స్పందించిన అధికారులు**



వీధిలైట్ల వెలుగులో లింగంపల్లి గ్రామం

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 23 : సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తుంది. కాగా చిల్పూరు మండలం లింగంపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. కేసీఆర్ పాలనలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణను స్పెషల్ ఆఫీసర్లు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి లైట్లు వెలుగక గ్రామస్తులు చీకట్లో ఇబ్బందులు పడుతున్న తీరుపై ఆదివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ''గ్రామాల్లో సమస్యలతో ప్రజలు సతమతం.. పట్టించుకోని స్పెషల్ ఆఫీసర్లు'' అంటూ కథనం వచ్చింది. దీనికి స్పందించిన అధికారులు ఆదివారం రాత్రి వీధి లైట్లను పునరుద్ధరించారు. దీంతో గ్రామంలోని వీధులు వెలుగులతో నిండిపోయా యి. గ్రామ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కరించేలా చేసిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



సోమల్లయ్యను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత బబ్బూరి శ్రీకాంత్

## బాధితుడికి బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్ పరామర్శ

దేవరుప్పుల, జూన్ 23: మండలంలోని కోలుకొండకు చెందిన బీఆర్ఎస్ యూత్ మండల నాయకుడు కోతి ప్రవీణ్ తండ్రి సోమల్లయ్య కాలుకు ఇటీవల శస్త్ర చికిత్స జరిగింది. సమాచారం తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం బాధితుడిని పరామర్శించారు. సోమల్లయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గనుపాక ఎల్లేశ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బోనగిరి యాకస్వామి, మండల నాయకులు మహ్మద్ ఖాసీం, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మాచర్ల బాబు, రామ్మూర్తి, నలుగూరి పరశురాములు, చింత నరేశ్, చీకట్ల కుమార్, బాష్యంపల్లి రాజు, శ్రావణ్, అశోక్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

SepTeK For All Your Septic Tank Needs

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

## 'డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలి'




రోడ్డుపై మురుగునీటిని చూపుతున్న వార్డు ప్రజలు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 23 : దశాబ్ద కాలంగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్పెషల్ ఆఫీసర్ శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరారు. డివిజన్ కేంద్రంలోని 15, 16 వార్డుల్లో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి, ఇళ్ల ముందుకొస్తున్నాయి. దీంతో దుర్గంధం వెలువడడంతో స్థానికులు వ్యాధులకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతుందన్నారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో డీఎస్ వెంకన్న ప్రత్యేక చొరవ చూపి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

## వృద్ధ దంపతులకు టోకరా..

**గ్యాస్ సిలిండర్, నగదుతో ఉడాయింపు**

దామెర, జూన్ 23 : మండలంలోని గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరి ఇండ్లకు వెళ్లి గ్యాస్ సిలిండర్లు, నగదు చోరీ చేసిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వృద్ధ దంపతుల వద్దకు ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి (30) గ్యాస్ బుక్ చేశారు.. వచ్చిందమ్మా అంటూ అడిగాడు. దీంతో వారు మాది భారత్ గ్యాస్.. రాజు గ్యాస్ తీసుకువస్తాడు కదా.. ఆయనేడి అని ప్రశ్నించగా, బండివద్దే ఉన్నాడంటూ డబ్బులు అడిగాడు. ఆ దంపతులు అతడికి రూ.వెయ్యితోపాటు ఖాళీ భారత్ గ్యాస్ సిలిండర్ ఇచ్చారు. ఎంతసేపైనా గ్యాస్ సిలిండర్ తీసుకురాకపోవడంతో అనుమానం వచ్చిన వారు పోలీసులకు సమాచారం అందించారు. కాగా, ఇదే గ్రామానికి చెందిన మరో ఇంట్లో గ్యాస్ సిలిండర్, నగదు గుర్తు తెలియని వ్యక్తి తీసుకెళ్లాడని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల దామెర, సింగరాజుపల్లి గ్రామాల్లో కూడా ఇదే తరహా మోసానికి పాల్పడినట్లు ప్రజలు తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రాములుయాదవ్

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

బచ్చనపేట, జూన్ 23: మండలంలోని పోచన్నపేటకు చెందిన నర్సింగ్ చంద్రయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సామాజిక సేవా కార్యకర్త పోతుల రామలుయాదవ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బుడిగ రామచంద్రం, కొక్కల కొండ బాబు, లింగయ్య, సత్యనారాయణ, నర్సింహులు, బాలయ్య, ఐలయ్య ఉన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని కొన్నె గ్రామంలో ఇటీవల మృతి చెందిన మేడోజు చంద్రయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు జంగిడి విద్యానాథ్ ఆదివారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వంచ వెంకట్‌రెడ్డి, నర్సయ్య, మహాత్మాచారి, గుత్తి సిద్ధిరాములు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. పోచన్నపేటకు చెందిన బండ భిక్షపతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మల్లికార్జున యూత్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో తుప్పతి కరుణాకర్, రెంట కల్యాణ్, పరిదె భాస్కర్, కనకరాజు సిద్ధులు, బండి సందీప్, ప్రవీణ్ పాల్గొన్నారు.




జనగామ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

# మోస్తరు వర్షంతో ఊరట..

- జిల్లాలో 7.2 మి.మీ వర్షపాతం నమోదు
- పంటల సాగుకు అనుకూలంగా వాతావరణం

జనగామ చౌరస్తా, జూన్ 23 : ఉరుములు, మెరుపులతో జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8.30నుంచి రాత్రి 9 గంటల వరకు 7.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బచ్చన్నపేటలో 28.8మి.మీ, అత్యల్పంగా కొడకండ్లలో 0.5 మి.మీ, పాలకుర్తి (గూడూరు) 1.0, పాలకుర్తి(వావిలాల) 12.8, పాలకుర్తి 10.3 మి.మీ వర్షపాతం నమోదైంది. నర్మెట 20.0మి.మీ, జనగామ 19.5, రఘునాథపల్లి 14.8, లింగాలఘనపురం 16.3, దేవరుప్పుల (కోలుకొండ) 7.0, చిల్పూరు (మల్కాపూర్) 4.3, తరిగొప్పుల (అబ్దుల్ నాగారం) 3.0, జఫర్‌గఢ్ 2.8, స్టేషన్ ఘన్‌పూర్ 1.5, తరిగొప్పుల 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 2నుంచి 3గంటల వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైల్వేస్టేషన్‌కు సమీపంలోని అండర్ బ్రిడ్జితోపాటు వీవర్స్‌కాలనీ అండర్ బ్రిడ్జి నుంచి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబా ద్ రోడ్డుమార్గంలోని కురుమవాడ, జ్యోతినగర్, బాలాజీనగర్‌లో వరదతో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. మరోవైపు జిల్లాలోని పలు మండలాల్లో ఉరుములతో పిడుగులు పడ్డాయి. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, చెట్లు నేలమట్టం కావడంతోపాటు రేకుల షెడ్లు కూలాయి. పలుచోట్ల కరెంట్ తీగలు నేలవాలడంతో విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడిందని పలువురు తెలిపారు. కాగా, సాగులో రైతులు బిజీ అయ్యారు.



రఘునాథపల్లిలో విత్తనాలు వేస్తున్న రైతు



వర్షంలో తడుస్తూ వెళ్తున్న కుటుంబం

**గ్రీవెన్స్‌ను సద్వినియోగం**

## చేసుకోవాలి

**గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

వరంగల్, జూన్ 23 : వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 1 గంటల వరకు గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. గ్రీవెన్స్‌కు సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## 28న డీసీసీబీ సభ

సుబేదారి, జూన్ 23 : ఈ నెల 28న ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభ నిర్వహిస్తున్నట్లు బ్యాంకు సీఈవో ఎండీ వజీర్ సుల్తాన్ తెలిపారు. నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సభకు పాలక మండలి సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు హాజరు కావాలని వజీర్ సుల్తాన్ కోరారు.